❖•❖•❖ 19 ❖•❖•❖

# సత్యము యెదుట నిలువబడుట

*“అందుకు పిలాతు, – ‘నీవు రాజువా?’ అని ఆయనను అడుగగా యేసు – ‘నీవన్నట్టు నేను రాజునే; సత్యమునుగూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని, సత్యసంబంధియైన ప్రతివాడును నా మాట వినుననెను’ ” (యోహాను 18:37–38ఎ).*

ప్రధాన యాజకులు యేసును పిలాతు యెదుటికి తీసికొనివెళ్లినప్పుడు, యేసును గూర్చిన వారి తీర్పుతో పిలాతు ఎలాగైనా సరే ఏకీభవించునట్లు చూడాలని వారు ధృఢనిశ్చయముతో ఉండిరి. ఈ సిలువ మరణము అమలు చేయబడునట్లు వారు వారి నిజాయితీనంతటిని సహితము బలి చేయుచుండిరి. అయినప్పటికి, వారు ప్రభుత్వాధికారికి విన్నవించుకొనగలిగిన ఒకే ఒక నేరము ఆయన యూదుల రాజని యేసు స్వాధికారముతో చెప్పాడనునది మాత్రమే. దోషనిర్ధారణను సాధించు నిమిత్తము, యేసు పలికిన మాటలు రోమా ప్రభుత్వమునకు విరోధమైన కుటిలమును దుష్టమునైన పన్నాగమైయున్నదనియు, యేసు చక్రవర్తికే ప్రత్యర్థిగా నుండుటకు వెదకుచున్నాడని అర్థమిచ్చునట్లును వారు వక్రీకరించవలసివచ్చినది.

పిలాతు యేసుకు తీర్పు తీర్చవలెనని కోరలేదు. యూదులకును యేసునకును మధ్య గల ఈ సంఘర్షణ యూదుల మహాసభ వ్యవహరించ వలసిన యూదీయ సమస్యయై యున్నదని ఆయన మొదటి నుండి నమ్మాడు యేసుకు వారంతట వారే తీర్పు తీర్చవలసియుండెనని ఆయన వాదించాడు. అయినప్పటికీ, ఈ సన్నివేశములోనికి కైసరు ప్రవేశపెట్టబడినప్పుడు, పిలాతు వారి మాటలు విని యేసును గూర్చి ఏదో ఒక విధమైన తీర్పును ఇవ్వవలసి వచ్చింది. రోమా ప్రభుత్వాధికారులలో ఎవరునూ రోమా ప్రభుత్వ శాసనమునకు చెందిన ఏ ప్రశ్ననైనను చర్చించకుండా ప్రక్కకు నెట్టివేయలేకపోయారు.

యేసు రాజైయున్నాడని స్వాధికారముతో చెప్పుచున్నాడను ప్రారంభ నేరము రాజభవనము యెదుటనుండిన కాలీ ప్రదేశములో ఆసీనుడైయుండిన పిలాతు యెదుట నివేదించబడింది. యూదయా విచారణ కర్తలు మలినమై పస్కాను భుజించునప్పుడు పాల్గొనుటకు అనర్హులౌతారేమో నను భయమునుబట్టి రాజభవనములోనికి ప్రవేశించుటకు నిరాకరించారు గనుక ఆయన తానే యేసును ప్రశ్నించుట యుక్తమని పిలాతు వెంటనే

గ్రహించాడు కానీ యేసును విచారించలవసిన చోటు ఆ చప్టా ప్రదేశము కాదు.

కలకలము సృష్టించెడు స్వభావము, అరుపుల శబ్దము, మరియు చప్టా ప్రదేశములో నెలకొని యున్న తీర్పును గూర్చిన గందరగోళము వలన పిలాతు యేసును రాజభవనము లోనికి తీసికొని వెళ్లాడు. యేసుతో వ్యక్తిగతముగా సంభాషించవలెనని పిలాతు ఆశిం-చాడు. కాబట్టి లోపల గదిలో, సమూహ సందడికి సుదూరముగా, ప్రపంచ చరిత్రలోనే అతి గొప్ప సంభాషణలలో ఒకటిగా పరిగణింపబడనై యుండిన సంభాషణలో పిలాతు తానే స్వయముగా నిమగ్నమయ్యాడు. యోబు, తన శారీరిక మానసిక బాధలను గ్రహించుటకు ప్రయత్నించుచుండినప్పుడు, "నేను సర్వశక్తుడగు దేవునితో మాటలాడగోరుచున్నాను, దేవునితోనే వాదింపగోరుచున్నాను" అని పలికాడు (యోబు 13:3). పిలాతు, ఆయన యెదుట నిలువబడియుండిన ఈ బందీని అర్థము చేసుకొనుటకు ప్రయత్నించుచుండినప్పుడు, దేవుని కుమారుని ఏకాంతముగా ప్రశ్నించాడు. దీనిని ఎవరూ ఊహించుకొనగలరు? "పిలాతు తిరిగి అధికారమందిరములో ప్రవేశించి యేసును పిలిపించి – 'యూదుల రాజువు నీవేనా?' అని ఆయన నడిగెను" అని యోహాను వ్రాయుచున్నాడు (యోహాను 18:33).

పిలాతు అడిగిన ప్రశ్నకు యేసు ప్రశ్నతోనే జవాబిచ్చాడు. "నీ అంతట నీవే యీ మాట అనుచున్నావా? లేక యితరులు నీతో నన్ను గూర్చి యిది చెప్పిరా? అని అడిగెను" (యోహాను 18:34). యేసు అడిగిన ఈ ప్రశ్న ఆయన యేసును అడిగిన ప్రశ్న యొక్క మూలాధారము గూర్చి యింకా కొంచెము లోతుగా ఆలోచించునట్లు చేసినది. అది స్వయాన ఆయన తలంపులకు తట్టినదా, లేక యూదులు తన నోటికి అందించారా? అక్కడ ఏమి జరుగుచుండినదో ఆయన అర్థంచేసికొనవలెనని పిలాతు యేసు యెదుట అంగీకరించవలసి వచ్చినది. ఆయన, "నేను యూదుడనా, యేమి? నీ స్వజనమును ప్రధానయాజకులును నిన్ను నాకు అప్పగించిరిగదా; నీవేమి చేసితివి?" అని పలికాడు (యోహాను 18:35). విడదీయుటకు వీలుకాకుండా బహు ఘనముగా నుండిన చిక్కు ముడిని అతని కొరకు ఆయన విప్పుచున్నాడని పిలాతు గ్రహించవలెనని యేసు ఉద్దేశించి యుండెను.

అప్పుడు, పిలాతుపై కలిగిన గొప్ప జాలితో, మన ప్రభువు తనను గూర్చిన సత్యమును పిలాతుకు స్పష్టముగా తెలియజెప్పాడు. ఆయన, "నా రాజ్యము ఇహసంబంధమైనది కాదు. నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు: గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదు" అన్నాడు (యోహాను 18:36). ఈ మాటలను పిలాతు గొప్ప ఆసక్తితో విని, అప్పుడు ఒక ప్రశ్నగాను ఒక ప్రకటనగాను ఉండిన వ్యాఖ్యానమును వెంటనే చేశాడు: "నీవు రాజువా?" అని. దేవుని గూర్చిన సత్యమును పిలాతు ఒక్క చిన్న వాక్యములో విన్నాడు, దానిని దాదాపుగా అర్థంచేసికొన్నాడు. ఈ సత్యమును పిలాతు అర్థంచేసికొన్నాడని ధ్రువీకరించుటకు, మన ప్రభువు దానిని యింకా కొంచెము విపులీకరించాడు: "నీవన్నట్లు నేను రాజునే; సత్యమునుగూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని; సత్యసంబంధియైన ప్రతివాడును నా మాటవినును" అని చెప్పాడు (యోహాను 18:37, 38). యేసు తనను గూర్చిన సత్యమును పిలాతు యెదుట అతి స్పష్టముగా ఉంచాడు. గనుక పిలాతు దానిని అంగీకరించవచ్చును లేదా తృణీకరించవచ్చును. ఈ సత్యమును అంగీకరించుటకు ఆతడు ఎన్నుకొన్నట్లయితే, పిలాతు అందు నిమిత్తము ఎంతో మూల్యం చెల్లించాల్సివుంటుంది. మన

ప్రభువు అంతకు మునుపు ఒక ఉపమానము ద్వారా సత్యమును నేర్పించినట్లు, సత్యము ఎప్పుడు గొప్ప విలువైన ముత్యమే. మనము దానిని కొనుక్కోవాలంటే, మన సమస్తమును మూల్యముగా చెలించాల్సిందే. పిలాతు, సత్యమును సంపాదించుకొనుటకు సమస్తమును అమ్ముటకు నిరాకరించి, బహుశ వికట భావనతో, "సత్యమనగా ఏమిటి?" అని యేసును అడిగాడు (యోహాను 18:38ఎ).

ఈ సందర్భములో యేసు ఇచ్చిన జవాబులోని కొన్ని మాటల్లో నిండుగా నిండియున్న ఇంత గొప్ప సత్యమును కనుగొనుటకు మనము యింకెక్కడ వెతకగలము? ఈ లోకములో ఎప్పుడైన జీవించియుండిన అత్యంత గంభీరమైన జీవితము, దేవుని కుమారుని జీవితము, యేసు పిలాతు యెదుట చేసిన సంక్షిప్త ప్రకటనలలో సారాంశముగా నున్నదని మనము చెప్పవచ్చును.

యేసు, *"నా రాజ్యము ఇహలోకసంబంధమైనది కాదు"* అని చెప్పాడు (యోహాను 18:36ఎ). యూదులు అన్నిటిని మించి ఒక రాజును ఆ రాజు ఏలు ఒక రాజ్యమును కోరుకొనుచున్నారని పిలాతు ఎరిగియుండెను. ఏది ఏమైనా, వారు కోరిన రాజ్యము ఇహలోకసంబంధమైనది, భౌతికమైనది, రోమా సామ్రాజ్యముతో పోరాడి దానిని ఓడించి రోమా ఆధిపత్యము నుండి వారికి స్వాతంత్ర్యమును తెచ్చు రాజ్యమై యుండవలెనని వారా ఆశించారు. యేసునకును యూదులకును మధ్య ఉండిన సంఘర్షణలో గల వాస్తవమైన అంశము ఇదే. యేసు ఆధ్యాత్మికమైన రాజైయుండెను, గనుక ఆయన ఆధ్యాత్మిక రాజ్యమును – ఇహలోక సంబంధమైనదికాని ఒక రాజ్యమును స్థాపించును. అయితే యూదులు ఒక భౌతికమైన రాజ్యము ఏర్పడవలెనని పోరాడుచుండిరి.

సాధారణముగా మన హృదయములు మనకు అవసరమైనవేమిటో మనము చూడని అంశములతో నిండియుండును. మనకు ఒక భౌతిక రాజ్యము అవసరములేదు; మనకు కావలసినది ఆధ్యాత్మిక పరిపాలన, హృదయములో స్థిర నివాసమేర్పరచుకొని మన ఆత్మను అదుపులో ఉంచు పరిపాలన కావలసి యున్నది, ఈ లోకమునకు భౌతిక రాజ్యము ఎన్నడునూ ఎక్కువగా ఇవ్వలేకపోయినది. అది ఖడ్గములను లేవనెత్తును, స్వల్పకాలము సజీవముగా ఉండును, ఆ తరువాత ఒత్తిడులతో పిడికిలి గట్టిగా మూసికొనినదై తనువు చాలించును. బలముతో కాలము గడిచిపోవచ్చునేమో, కానీ అది ఆత్మను మరియు హృదయమును భరించి ఈ లోక రీతిగాను తరువాతి లోక రీతిగాను ఆనుకొని జీవనాధారముగా మనజాలదు.

యేసు, *"సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని"* అని చెప్పాడు (యోహాను 18:37, 38). యేసు ఆయన రాజ్యమును స్థాపించుటకు అవసరమైన ఆరంభ పనులను చేయుట మొదలుపెట్టుటకు యీ లోకమునకు వచ్చాడు. ఆయనను గూర్చిన సత్యమును మనకు తెలియజెప్పుటకు వచ్చాడు. వాస్తవమునకు క్రొత్త నిబంధన రెండు భాగములుగా భాగింపబడి యున్నది. మొదటి భాగమును, "రాజ్యము కేంద్రీకృతమైయున్న క్రీస్తు" అనియు, రెండవ భాగమును, "క్రీస్తు కేంద్రీకృతమైయున్న రాజ్యము" అని పిలువవచ్చును. యేసు, "మీరు నా రాజ్యమును అర్థం చేసికొనలేకపోయినట్లయితే, నేనెందుకు వచ్చానో మీరెన్నటికిని అర్థం చేసికొనలేరు. నేను నన్ను మరియు నా రాజ్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకును వచ్చితిని" అని చెప్పుచుండెను.

యేసు, *"నేను చెప్పుచున్నది జీవితమును గూర్చిన గొప్ప సత్యమైయున్నది"* అని

ఘోషించుచుండెను. యేసు పిలాతుకు సత్యమును ఇచ్చుట మాత్రమేగాక, మానవాళి తెలిసికొనగల సత్యములలో ఒక అతి గొప్ప సత్యమును కూడా తెలియజెప్పాడు. మనకు సత్యమును తెచ్చుటకే ఆయన ఈ లోకమునకు వచ్చాడని యేసు చెప్పాడు. యేసు, "సత్యమును తెలిసికొనవలెనని నీవు నిజముగా ఆశించినట్లయితే, నీవు తెలిసికొనగలవు" అని పిలాతు తెలిసికొనునట్లు దానిని వివరించాడు. సత్యమును నిజముగా తెలిసికొనగోరువాడు సత్యమునకు సంబంధించినవాడై యున్నాడు. యేసు సత్యము యొక్క మూర్తిమంతమునై యున్నాడు కాబట్టి సత్యమునకు సంబంధించినవాడు ఆయనిచ్చు ఆదేశములను ఆలకించును.

యేసు పిలాతుతో చెప్పిన విషయములో గల విలువను మనము కొంచెము జాగ్రత్తగా యోచించుదము. దేవుని కుమారుడు ఆయనను, ఆయన రాజ్యమును, మరియు ఆయనను వెంబడించనైయున్నవారిని గూర్చిన సత్యమును పిలాతుకు వివరించాడు. పిలాతు విని గ్రహించగలుగుటకు అదొక గొప్ప సదవకాశముగా ఉండినది, కానీ ఆయన ఆలా చేయుటకు నిరాకరించాడు. మనము కూడా, సత్యము యెదుట నిలువబడియున్నాము. దానిని చదువవచ్చును మరియు దాని గూర్చి ఆలోచన చేయవచ్చును; అప్పుడు, దానిని మనము మరొకసారి చదివి దాని గూర్చి యింకా యోచించవచ్చును. పిలాతు సత్యము యెదుట నిలువబడి యున్నప్పుడు అతడు సత్యము యెడల ఎట్లు వ్యవహరించాడో మనమెరుగుదుము. మన యెదుట నున్న పెద్ద ప్రశ్న ఏమనగా; సత్యము యెదుట నిలువబడియున్న మనము సత్యముతో ఏమి చేస్తాము?

❖◆❖◆❖

*సత్యము పిలాతుకు బహు సమీపంగా ఉండినది, ఆలాగే అది మనకు కూడా అతి సమీపంగా నున్నది సత్యమనగా ఏమిటో తెలిసికొనవలెనను కోరిక మనకున్నట్లయితే, మనము దానిని తెలిసికొనగలము. సత్యమును వినగలుగునట్లు మనము వాస్తవముగా ఆలకించినట్లయితే మనము దానిని వినగలము. మనము సత్యమును వాస్తవముగా వెదకినట్లయితే, మనము దానిని కనుగొనగలము, "నీ వాక్యమే సత్యము!" అనియు (యోహాను 17:17బి) "నేనే ... సత్యమునై యున్నాను" అనియు (యోహాను 14:6) యేసు చెప్పెను.*